క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశాలు

ఓబులవారిపల్లె/రైల్వేకోడూరు అర్బన్ : రీకాలింగ్ చంద్రబాబు మానిఫెస్టో కార్యక్రమంలో భాగంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లిలో గురువారం నేడు ఉదయం 9 గంటలకు, కోడూరు కేంద్ర కార్యాలయంలో 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు చిట్వేలిలో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బుధవారం తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొని కూటమి అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పేర్కొన్నారు.

ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు

పుల్లంపేట : పుల్లంపేట నందు బుధవారం పారిశుధ్యంలో భాగంగా సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలకు మరమ్మతులు జరిపారు. అవసరమైన చోట కొత్త ఎల్‌ఈడీ బల్బులను బిగించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రమేష్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది



రమేష్ రెడ్డిని సత్కరిస్తున్న మక్బూల్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంటు పరిశీలకులు రెడ్డప్పగారి రమేష్‌కుమార్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మక్బూల్ బాషా పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లిలోని రమేష్ రెడ్డి నివాసంలో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టే కేసులకు ఎవరూ బెదిరే పరిస్థితి లేదన్నారు. రమేష్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గం ఇన్‌చార్జ్ మక్బూల్ బాషాతోపాటు పలువురు నేతలు పరామర్శించి దుశ్శాలువాలతో సత్కరించారు.

22 బంగారు కుటుంబాలు గుర్తింపు

నందలూరు : నందలూరు గ్రామ పంచాయతీ సచివాలయం - 2 పరిధిలో 22 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు మండల ప్రత్యేకాధికారి గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ రాధాకృష్ణన్, తహసీల్దార్ అమరేశ్వరి ఆధ్వర్యంలో పీ4 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ పిళ్లై మాట్లాడుతూ 22 బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా ఇద్దరినీ ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సునీల్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్, నందలూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయాధికారి మల్లికార్జున, సీడీపీపీ మెంబర్ సుజిత, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ రాజశేఖర్

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీ గంగరాజుపురంలో బుధవారం యూనియన్ బ్యాంక్ అందిస్తున్న పథకాలపై బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎం జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండి వారి ఉచ్చులో పడకుండా బ్యాంక్ అధికారులను సంప్రదించాలని వారు కోరారు. కేవలం బ్యాంకు పథకాలన్నీ స్థానిక బ్రాంచ్‌లలో పొందవచ్చన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జవహర్

వీరబల్లి : డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని మండల అభివృద్ధి అధికారి జవహర్ బాబు తెలిపారు. బుధవారం మండల పరిషత్ సభా భవనంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ద్వారా అధిక మొత్తంలో రుణాలు తీసుకొని వాటి ద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆదాయం పొందాలన్నారు. తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించినట్లైతే తిరిగి అధిక మొత్తంలో డబ్బులు పొందవచ్చన్నారు. కుటుంబంలో మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడు ఆ కుటుంబ సభ్యులు కూడా సుఖంగా జీవనం సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, లీగల్ కో–ఆర్డినేటర్ ఆనందబాబు, ఏపీఎం ఖాదర్ వలి, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

లాభదాయకం.. పెరటికోళ్ల పెంపకం

- గ్రామీణులకు మెండుగా ఉపాధి
- తక్కువ పెట్టుబడితో ఆదాయం



పలు రకాల కోళ్లను పెంచుతున్న దృశ్యం

రాయచోటి జగదాంబసెంటర్ : గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ల పెంపకం ఒకప్పుడు రైతుల జీవనశైలిలో భాగంగా ఉండేది. కానీ మారిన పరిస్థితుల్లో కోళ్ల పెంపకం పౌల్ట్రీ ఫారాలకే పరిమితమైంది. నాటుకోళ్ల నుంచి గుడ్లు, మాంసం దిగుబడి తక్కువగా ఉండటం వల్ల, వీటి పెంపకం రానురాను కనుమరుగై బ్రాయిలర్ కోళ్లు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయంలో పాడి పరిశ్రమ తర్వాత స్థానం పెరటికోళ్ల పెంపకానిదే. గ్రామీణ ప్రాంతాల్లో పెరటికోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందంటున్నారు పశువైద్యాధికారులు.

ఇంటి పరిసరాల్లోనే..

దేశవాళీ కోళ్లకు ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం తొలకరి పలుకరించిన తరుణంలో కోళ్ల పెంపకం మంచిది. గడ్డి, పురుగులు, వర్షానికి కొట్టుకుని వచ్చే విత్తనాలు ఈ సీజన్‌లో కోళ్లకు మంచి ఆహారం. పెద్దగా పెట్టుబడి లేని పెరటికోళ్ల పెంపకంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతు మహిళలు, కూలీలు ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ వ్యర్థాలను మేతగా వేస్తే సరిపోతుంది. నాటుకోళ్లు తినడంతో పౌష్టికాహారం కూడా లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆరుబయట తిరుగుతూ పెరగడంతో మాంసంలో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. వీటి మాంసం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. కనీసం పెట్టుబడితో స్వల్ప కాలంలోనే లాభాలు పొందవచ్చు.

జాతి ఎంపిక ముఖ్యం

కరోనా కాలంలో కోడిమాంసం, గుడ్లు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్న ప్రచారం జరగడంతో ప్రధానంగా నాటుకోడి మాంసం విక్రయాలు పెరిగాయి. స్టెరాయిడ్ ఇంజక్షన్లు, దాణాతో 40 రోజుల్లో మార్కెట్‌కు సిద్ధం చేస్తున్న బ్రాయిలర్ కోడి మాంసం తినడానికి ఇష్టపడని మాంసం ప్రియులు.. నాటుకోళ్లను కొనడానికి పోటీపడుతున్నారు. మార్కెట్లో గిరిరాజా వనరాజా కోళ్లతో పాటు కలర్ కోళ్లను పెంచుతున్నా.. నాటుకోళ్లను కొనడానికే ఇష్టపడుతున్నారు. అవకాశం ఉన్న ప్రతి రైతు తమ వ్యవసాయ క్షేత్రాల్లో నాటుకోళ్లను పెంచుతున్నారు. ఈ కోళ్లను ఎంపిక చేసుకున్నప్పుడు అన్ని రకాల టీకాలు వేయించారో? లేదో విచారించాలి. ఐదారు వారాల కోడిపిల్లలకు అన్ని రకాల టీకాలు వేయిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవు.

పెంపకంలో మెలకువలు

గ్రామీణులు 10 నుంచి 20 కోళ్లను ఒక సమూహంగా ఆరుబయట స్వేచ్ఛగా పెంచుకోవచ్చు. సహజమైన మేత పెడితే సరిపోతుంది. ఆరువారాల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వెదురుకర్రలు, చెక్కలు వంటి స్థానికంగా లభించే వ్యర్థాలతో వీటికి వసతి ఏర్పాటు చేసుకోవచ్చు. 4–8 వారాల్లోపు పిల్లలకు ఒక చదరపు అడుగు, 8–12 వారాల్లోపు వాటికి రెండు చదరపు అడుగుల స్థలం కేటాయిస్తే సరిపోతుంది. కోళ్లు విసర్జించే వ్యర్థాల నుంచి ఏర్పడే తేమను పీల్చుకోవడానికి, చల్లదనం కోసం రంపపు పొట్టును లిట్టర్‌గా వాడుకోవాలి. 5–10 సెంటీమీటర్ల మందంగా పొట్టును పరిచి తరచూ సర్దుకోవాలి.

నాణ్యమైన ఆహారం



కోడిపిల్లలకు 28 రోజుల వయస్సు వరకు దాణా అందించడం శ్రేయస్కరం. ఈ దాణా స్థానికంగా లభించే వ్యర్థాలతో తయారు చేసుకుంటే ఖర్చు వ్యయం ఉండదు. ముఖ్యంగా మొక్కజొన్న రవ్వ, పిల్లలు పెరిగే కొద్దీ నీటితొట్టెలు, మేత తొట్ల సంఖ్య కూడా పెంచుకోవాలి. ఈ రకం కోళ్లకు న్యూకాస్టల్, ఫౌల్‌ఫాక్స్ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. వీటి నివారణకు 8–9 వారాల పిల్లలకు టీకాలు వేయించాలి. ఈ రకం కోళ్లు 42 రోజుల వయస్సులో 650 – 750 గ్రాముల వరకు పెరుగుతాయి. పెరటి కోళ్లను గుడ్ల ఉత్పత్తి కోసం వేరుచేయాలి. 10 – 20 కోళ్ల గుంపులో ఒకటి నుంచి రెండు పుంజులు ఉండేలా చూసుకోవాలి. ఆరుబయట ఉండటం వలన పరాన్నజీవుల సమస్య వచ్చే అవకాశం ఉన్నందున రెండు, మూడు నెలల మధ్య నట్టల నివారణ మందులు వాడాలి.

– డాక్టర్. భాస్కర్, పశువైద్యాధికారి, చిన్నమండెం

ఆ ముగ్గురిని ఓడించారనే బాబుకు మిథున్‌రెడ్డిపై కక్ష

రాజంపేట టౌన్ : రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసిన మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సీఎం దివంగత ఎన్‌టీఆర్ కుమార్తె పురందేశ్వరిని, టీటీడీ మాజీ చైర్మన్ దివంగత ఆదికేశవులనాయుడు సతీమణిని ఓడించిన కారణంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై చంద్రబాబు నాయుడు కక్షకట్టి అరెస్ట్ చేయించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు ఎప్పుడు ప్రజల పక్షానే ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తున్నారని, అవసరమైతే వారి సొంత డబ్బులతో ప్రజలను ఆదుకుంటారన్నారు. మిథున్‌రెడ్డిని ఓడించేందుకు ఎవరిని బరిలోకి దింపినా వారిని చిత్తుచిత్తుగా ఓడించారని చంద్రబాబునాయుడు ఆయనపై విపరీతమైన కక్షను పెంచుకున్నారన్నారు. అందువల్ల మద్యం స్కాం పేరుతో చంద్రబాబు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని దుయ్యబట్టారు. ఎంపీ అయిన మిథున్‌రెడ్డికి మద్యంతో ఏం సంబంధమని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు ఆయన తనయుడు కలిసి వారి ఖజానా నింపుకునేందుకు మద్యం వ్యాపారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పి, ప్రతి గ్రామంలో ఐదారు బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి మద్యం విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు.

అంకితభావం ఉంటేనే విజయాలు

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల(అటానమస్)లో బుధవారం మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, అంకితభావం కలిగి ఉంటేనే విజయం సాధ్యమవుతుందన్నారు. తరగతి గదిలో నేర్చుకునే పాఠాలను ప్రయోగశాలలో సాక్షాత్కరంగా అర్థం చేసుకొని, కమ్యూనికేషన్, స్మార్ట్ స్కిల్స్‌లలో నైపుణ్యం సంపాదించి, తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హీరా రాజపుత్, కళాశాల ప్రిన్సిపల్ డా.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటరమణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం ఎందాకైనా పోరాటం



తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి టౌన్ : నన్ను కోవర్టు అంటున్నారు.. నా తండ్రిని కూడా విమర్శిస్తున్నారంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలోని బలిజపల్లె (నార్పపల్లెలో) దివంగత మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పాలకొండ్రాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నా కుటుంబం ఎప్పుడూ బడుగు బలహీనవర్గాల కోసం పని చేసిందన్నారు. నాన్న ఎప్పుడూ కార్యకర్తలు, పేదల కోసం పని చేశాడే కానీ ఏనాడు డబ్బుల కోసం పాటు పడలేదని పేర్కొన్నారు. కోవర్టులు ఎవరో రాయచోటిలో చిన్న పిల్లలను అడిగినా చెబుతారన్నారు. కార్యకర్తల కోసం ఎందాకైనా పోరాడుతానని భరోసా ఇచ్చారు. 2029లో పార్టీ టికెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా కచ్చితంగా పోటీ చేసి తీరుతానని తేల్చిచెప్పారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన

సిద్దవటం : ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తామని సిద్దవటం తహసీల్దారు తిరుమల బాబు హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె, మాధవరం గ్రామ పంచాయతీలలోని ప్రభుత్వ స్థలాలను బుధవారం తహసీల్దారు తిరుమల బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మాధవరం 1,2,3 వార్డుల గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కావడమే కాకుండా భవన నిర్మాణాలు కూడా చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారికి త్వరలో నోటీసులు జారీ చేస్తామని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఏ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాల కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఖాళీగా ఉన్న భవనంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన గావించినట్లు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ నందలూరులో జూనియర్ కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి నందలూరు జడ్పీ హైస్కూల్‌లో కళాశాల నిర్వహించడం జరుగుతోందన్నారు. దీని వల్ల అటు స్కూల్ విద్యార్థులకు ఇటు కళాశాల విద్యార్థులకు ఇబ్బందికర వాతావరణం చోటు చేసుకుందని అన్నారు. అందువల్ల కళాశాలను గతంలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణన్, తహసీల్దార్ అమరేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగసుబ్బయ్య, కాకిచంద్ర, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్‌లు

ఓబులవారిపల్లె : ఎనభై శాతం సబ్సిడీతో రైతులకు డ్రోన్‌లు ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తికర రైతులు డ్రోన్‌లు తీసుకోవాలని వ్యవసాయ అధికారిణి(ఏఓ) మల్లిక తెలిపారు. బుధవారం బి.కమ్మపల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సమీపంలో అరటి, బొప్పాయి తోటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది.

వాహనాల తనిఖీ

సుండుపల్లె : వాహనదారులు నియమ,నిబంధనలు తప్పక పాటించాలని లేనిపక్షంలో జరిమానా, జైలు శిక్షలకు గురికావాల్సి వస్తుందని సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని వెంగమరాజుగారిపల్లె సమీపంలో ఆయన బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు.

హమాలీలకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న హమాలీలు

రాజంపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న సివిల్ సప్లయిస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.సికిందర్ ప్రభుత్వంను డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న సివిల్ సప్లయిస్ పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం హమాలీలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీలకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం ప్రతి నెలా జాప్యం చేస్తుందని మండిపడ్డారు. సివిల్ సప్లయిస్ డీటీలు ప్రతి నెల 3వ తేదీ లోపు బిల్లులు పెట్టాలని కోరారు. డీటీలు బిల్లులు ఆలస్యంగా పెట్టడం కారణంగానే వేతనాల చెల్లింపులలో జాప్యం జరుగుతుందని మండిపడ్డారు. 2 నెలల క్రితం తిరుపతి జిల్లా ఏర్పేడు సివిల్ సప్లయిస్ పాయింట్‌లో పని చేసిన సన్న బియ్యం ప్యాకింగ్, లోడింగ్ చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని కోరారు. యూనిఫాం కుట్టు కూలిలు ఇవ్వాలని కోరారు. లారీ మామూళ్లను 11 సంవత్సరాలుగా పెంచలేదని వాపోయారు. తక్షణమే లారీ మామూలు పెంచాలని అదే విధంగా పాయింట్‌లలో తాగునీరు బిల్లులు చెల్లించాలని కోరారు. నిరసనలో హమాలీలు ప్రసాద్, చౌడయ్య, రాఘవేంద్ర, సుధాకర్, విజయ్, రామాంజి, కోవెట్ల, ఈరన్న, బాలరాజు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

రాయచోటి జగదాంబసెంటర్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని వైఎస్ఆర్‌సీపీ స్టేట్ వింగ్ జాయింట్ సెక్రటరీ గాలివీటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాయచోటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్ఆర్‌సీపీ పోరాటాలు చేస్తోందన్న అక్కసుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఇటువంటి అరెస్టులకు ప్రభుత్వం పాల్పడుతున్నదని అన్నారు. లిక్కర్ స్కాం అనేది జరగలేదని కావాలనే ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తోందన్నారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ప్రజల తరపున వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ పోరాటం చేస్తూనే ఉంటారన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు పప్పిరెడ్డి అమరనాథరెడ్డి, పప్పిరెడ్డి మనిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలోని పెద్దూరు కస్బాలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తహసీల్దార్ ఖాజాబీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పిల్లలకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయన్న, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలను ఎప్పుడు నెరవేరుస్తారు?

రాజంపేట రూరల్ : ఎన్నికల సమయంలో రాజంపేట ప్రాంతానికి కూటమి ప్రభుత్వం నాయకులు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూల భాస్కర్ మండిపడ్డారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాడు ప్రతిపక్ష హోదాలో రాజంపేట అభ్యర్థి ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణం నడిబొడ్డున నేటి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఇచ్చిన వరాలు ఎప్పుడు నెరవేర్చుతారని ప్రశ్నించారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తాము, మెడికల్ కాలేజీ మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. రాజంపేట వాసుల చిరకాల ఆశల కలలను నెరవేర్చే బాధ్యత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పైన ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలుపుకోవాలని బాబు, పవన్‌కల్యాణ్‌లను కోరారు. లేకుంటే ఈ ప్రాంత ప్రజల వ్యతిరేకతను మూటకట్టుకుంటారని తెలియజేశారు.

తాళ్లపాక అభివృద్ధికి టీటీడీ ఆమోదం



పోతుగుంటను సత్కరిస్తున్న తాళ్లపాక గ్రామస్తులు

రాజంపేట టౌన్ : తాళ్లపాక అభివృద్ధికి టీటీడీ పాలకమండలి ఆమోదముద్ర వేయడం ఎంతో ఆనందంగా ఉందని భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జ్, రాష్ట కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని తాళ్లపాక అన్నమయ్య ధ్యానమందిరం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాళ్లపాక గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తాను ఈనెల 7వ తేదీన టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్‌రెడ్డితో కలిసి ఈఓ శ్యామలరావుకు వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. అందుకుగాను ఇటీవల నిర్వహించిన టీటీడీ పాలకమండలి సమావేశంలో భానుప్రకాష్‌రెడ్డి తాళ్లపాకలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు విషయమై సమావేశం దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ కారణంగా తాళ్లపాక రహదారిని విస్తరించి రోడ్డుకు ఇరువైపులా కవులు, కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేసి లైటింగ్, దేవుడి పాటలతో కూడిన మైక్‌సెట్ ఏర్పాటుకు, తాళ్లపాక చెరువులో అన్నమయ్య పదకవితలు రాస్తున్నట్లుగా విగ్రహం, తాళ్లపాకలో సంగీతం, నృత్య కళాశాల, మ్యూజియం, లడ్డూ కౌంటర్ ఏర్పాటు, అన్నమయ్య జీవించిన కాలం నాటి రోజుల్లో ఆయన నివసించిన ఇంటి నమూనా, ధ్యానమందిరం పునర్నిర్మించేందుకుగాను పాలకమండలి ఆమోద ముద్ర వేసినట్లు ఈసందర్భంగా రమేష్‌నాయుడు తెలిపారు. పోతుగుంట రమేష్‌నాయుడును బీజేపీ నాయకులు, తాళ్లపాక ప్రజలు ఘనంగా సత్కరించారు.

నర్సరీ నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



నర్సరీని పరిశీలిస్తున్న హెచ్ఓ సింధూరి

లక్కిరెడ్డిపల్లి : నర్సరీ నిర్వహణకు రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉద్యాన అధికారి సింధూరి సూచించారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల్లోని వివిధ నర్సరీలను పరిశీలించి యజమానులకు నియమ, నిబంధనలను వివరించారు. నర్సరీ స్థాపించిన ఆరు నెలలులోపు రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్సు పొందాలని తెలిపారు. లైసెన్సు పొందుటకు దరఖాస్తు చేసుకోవాలని, నర్సరీ ఉన్న భూమి తాలుకా పాస్‌బుక్ జిరాక్స్, వన్–బీ ఒకవేళ కౌలు భూమి అయినచో కనీసం మూడు సంవత్సరాలకు లీజ్ అగ్రిమెంట్, ఆధార్ కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, రాబోవు మూడు సంవత్సరాల కాలంలో నర్సరీలో పెంచే మొక్కల వివరాలు, నేల, నీటి విశ్లేషణ పరీక్ష నివేదిక, నర్సరీ నమూనా, చలానా మొత్తం చెల్లించి నర్సరీ లైసెన్సు పొందాలన్నారు. ప్రతి నర్సరీలోనూ మొక్కలు అమ్మడానికి సంబంధించిన రిజిస్టర్, నర్సరీలో చేపట్టబడిన సస్యరక్షణ వివరాలు, విత్తన కొనుగోలు రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని తెలిపారు.

‘రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి’



పసుపులేటి శంకర్

నందలూరు : అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ కోరుతూ వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రాజంపేటలో 1905 సంవత్సరం నుంచి 20 ఎకరాలలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఉందని అన్నారు. నందలూరులో 305 ఎకరాల విస్తీర్ణంలో ఆల్విన్ కర్మాగారం ఉండేదని, 15 ఎకరాలలో ఏపీ ఎస్ఆర్‌టీసీ డిపో, రహదారులు భవనముల శాఖ విశ్రాంతి గృహాలు ఉన్నాయన్నారు. రాజ్యాంగ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంగా ఉందని తెలిపారు. పెన్నా, చెయ్యేరు నదులు కలిగిన ప్రాంతము, పంటలకు అనువైన సారవంత భూములు ఉన్న ప్రాంతమన్నారు. పద కవిత పితామహులు అన్నమయ్య, భక్త కన్నప్ప, సహజకవి భక్త పోతన నడయాడిన నేల ఇది అని తెలిపారు. రాజంపేటను ప్రభుత్వం గుర్తించి పరిశీలించి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతున్నట్లు శంకర్ తెలిపారు.

కూటమిపై మహిళల తిరుగుబాటు తప్పదు



ఏకుల రాజేశ్వరిరెడ్డి

సిద్దవటం : రాష్ట్ర ప్రజలనే కాకుండా మహిళలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసం చేశారని వైఎస్ఆర్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికారం కోసం ఎన్నికల ముందు ఎన్నో అబద్ధపు వాగ్దానాలు చేసి వాటిని నిలబెట్టుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలి అని అన్న మంత్రి అచ్చెన్నాయుడుకు తల ఎక్కువ బుర్ర తక్కువ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. చంద్రబాబుకు అమ్ముడుపోయి జెండా కూలిగా మారిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఎక్కడ నిద్రపోతున్నారని ప్రశ్నించారు. పాలన ఇలానే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా మహిళల తిరుగుబాటు తప్పదని ఆమె హెచ్చరించారు.

పీహెచ్‌సీ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

పెనగలూరు : పెనగలూరులోని పీహెచ్‌సీని మండల తహసీల్దార్ అమరేశ్వరీ పరిశీలించారు. ఈ సందర్భంగా మందులు పంపిణీ చేసే గదిలో మందుల కొరత ఉందా అన్న అంశంపై ఆరాతీశారు. మందులను సక్రమంగా ఇస్తున్నారా లేదా, రక్త పరీక్షలు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. తదుపరి పలు రికార్డులను ఆమె పరిశీలించారు.

విద్యార్థులకు ఉపయోగకరం ‘ఇంగ్లిష్ క్లబ్’

రాయచోటి టౌన్ : ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం అత్యంత అవసరమైన భాష ఇంగ్లిష్ అని రాయచోటి డైట్ కళాశాల ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు అన్నారు. బుధవారం రాయచోటి డైట్ కళాశాలలో ×ఇంగ్లిష్ క్లబ్ ।ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంగ్లిష్ క్లబ్ ద్వారా విద్యార్థులు ఎంతో ఉపయోకరంగా మారుతుందని చెప్పారు. ఈ ఇంగ్లిష్ క్లబ్‌లో డైట్ విద్యార్థులు (టీచర్ ట్రైనింగ్ చదువుతున్న) వారితో ఒక మ్యాగజైన్ పుస్తకాన్ని తయారు చేసి ఆ పుస్తకాన్ని పాఠశాలలకు పంపిస్తారని తెలిపారు. అనంతరం ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇంగ్లిష్ భాష ఒక మహత్తర శక్తి అని, భిన్న సంస్కృతుల మధ్య వారిధిగా ప్రపంచాన్ని కలిపే పాత్ర వహిస్తోందన్నారు. ఈ క్లబ్ అందించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవలని కోరారు. క్లబ్‌లో అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు చేరేలా రూపొందించబడతాయన్నారు. డైట్ ఇంగ్లిష్ అధ్యాపకుడు తిరుపతి శ్రీనివాసులు, డైట్ అధ్యాపకులు కె. వెంకటసుబ్బారెడ్డి, ఎం.శివభాస్కర్, వైసీ రెడ్డెప్ప, ఎం.మోహన్ నాయక్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ4 పాలసీ

గాలివీడు : పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు ఎంపీడీఓ చంద్ర మౌళీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం గాలివీడు–1 సచివాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో ఉన్న సంపన్నులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఉన్నత విద్యావేత్తలు, ఎన్నారైలు, ఉద్యోగులు మొదలైన వారు మార్గదర్శకులుగా మారి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనుటకు గాను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. అనర్హులను గుర్తించి అర్హులను చేర్చుటకు గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



లక్కిరెడ్డిపల్లి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు, పాల్గొన్న గ్రామస్తులు



చిట్వేలి: రైతులకు చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారి మణి

చిట్వేలి/రాయచోటి టౌన్ : ప్రజలు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద తమకు కావాల్సిన సమాచారాన్నా పొందవచ్చని అధికారులు మణి (వ్యవసాయ సహాయ సంచాలకులు), కె.రాజేంద్ర ప్రసాద్ (రాయచోటి ఏఓ) తెలిపారు. బుధవారం రాయచోటి మండలంలోని శిబ్యాల గ్రామంలో, చిట్వేలి మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు సమాచార హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు తమకు కావాల్సిన సమాచారం ప్రతి శాఖ నందు సంబంధిత పౌర సమాచార శాఖ అధికారికి దరఖాస్తు చేసి సమాచారం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కుచట్టం విధి విధానాలను వివరించారు. ఈ

లక్కిరెడ్డిపల్లి : సమాచార చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ అధికారి రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్బీకే కార్యాలయం నందు సమాచారం చట్టంపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి అనూష, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.